

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38(ఆదివారం)
కనిష్ఠం : 29

మెయిన్‌లో..
దగ్ధమైన అంతర్వేది రథానికి రూ.96.39లక్షల ఇన్సూరెన్సు



సీనరేజీ.. మింగేశారు!

రూ.196.17 కోట్ల సీనరేజి నిధులకు వైసీపీ ఎగనామం

- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- గత ఐదేళ్లలో పూర్తిగా వసూళ్లు
- స్థానిక సంస్థలకు ఎగవేత
- ఆర్థిక సంస్థల నిధులూ ఇంతే
- పంచాయతీరాజ్‌కు తీవ్ర అవస్థ
- పవన్ ఆదేశాలతో గుట్టురట్టు
- లెక్క తేల్చిన అధికారులు
- మంత్రికి నివేదిక అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కుంభ కోణం అంతా ఇంతా కాదు. అస్మదీయ కంపెనీలను అడ్డం పెట్టుకుని అప్పటి ప్రభుత్వ పెద్ద లు వేల కోట్లు దోచేశారు. ఐదేళ్ల పాటు ఇసుక దందాతో పెద్ద ఆర్థిక సామ్రాజ్యాన్నే నిర్మించుకు న్నారు.ఇసుక తవ్వకాల ద్వారా సొంత ఆదాయం పెంచుకున్న నాటి ప్రభుత్వ పెద్దలు సీనరేజీ సొమ్మును సైతం దారి మళ్లించేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రీచ్‌ల పరిధిలో పం చాయతీలు, మం డల పరిషత్‌లు, జిల్లా పరి షత్‌కు ఈ డబ్బులను పంచాల్సి ఉంది.అయితే అదేదీ కాదని ఏకంగా దారి మళ్లించేశారు. ఐదేళ్ల పాటు రూ.196.17 కోట్లకు పంగ నామాలు పెట్టారు.అధికారికంగా ఇసుక తవ్వకం కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసినా వాటిని పం చాయతీలు,మండలపరిషత్, జడ్పీ ఖాతాలకు జమ చేయ లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో వైసీపీ హయాంలో ఇసుక సీనరేజీ నిధులను ఎంత మేరకు ఎగ్గొట్టారనే దానిపై నివేదిక తయారు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇటీవల గత ప్రభుత్వ నిర్వాకాన్ని బట్టబయలు చేశారు.

అంతా అడ్డగోలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ఇసుకకు భారీ డిమాండ్ ఉంటుంది. పక్కనే ఉన్న విశాఖ నుంచి విజయవాడ వరకు అనేక నిర్మాణాలకు గోదావరి ఇసుకనే వాడతారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 23 వరకు రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. అత్యధికంగా కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి లోని రీచ్‌ల్లో తవ్వకాలు ఐదేళ్ల పాటు నిరాట ంకంగా నడిచాయి. లక్షలాది టన్నుల ఇసుకను తరలించేశారు. అధికారిక, అనధికారిక రీచ్‌ల నుంచి కోట్ల విలువైన ఇసుకను తవ్వి తర లించేశారు.అధికారికంగా అనుమతించిన రీచ్‌ల్లో దాదాపుగా ఇసుకను జేపీ గ్రూపు భారీ స్థాయిలో తవ్వింది.ఇలా తవ్వినందుకు ఇసుక సీనరేజీని సంబంధిత పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు చెల్లించే నిమిత్తం ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి. ఆ సొమ్మును ప్రభుత్వం ఆయా పంచాయతీరాజ్ వ్యవస్థల ఖాతాలకు జమ చేయాలి. కానీ వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ఇసుక ద్వారా ఖజానాకు వేల కోట్ల ఆదాయం సమకూరినా ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలకు నిధులు మాత్రం ఇవ్వలేదు. ఇసుక తవ్వే కంపెనీలు, సంస్థల నుంచి అధికారికంగా ఐదేళ్ల సీనరేజీ వసూలు చేసినా వాటిని దారి మళ్లించేసింది. స్థానిక సంస్థలకు పంగ నామాలు పెట్టింది. దీంతో ఏ అవసరానికీ పంచాయతీలకు డబ్బుల్లేక ఈసురోమనాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదే కాదు 14,15 ఆర్థిక సంఘం నిధులు సైతం పంచాయతీలకు ఇవ్వ కుండా మింగేసింది. చివరకు విద్యుత్ బకాయిల పేరుతో గుంజేసింది. పంచాయతీలను ఐదేళ్ల పాటు జగన్ సర్కారు నిర్వీర్యం చేసింది.



పవన్ ఆదేశాలతో గుట్టురట్టు..

గతేడాది డిప్యూటీ సీఎం పవన్ పం చాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాకినాడలో అధికారులతో సమీక్షించారు. గడచిన ఐదేళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచకాలపై అధికారులతో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి వచ్చే సీనరేజీ ఎంత మేర దారిమళ్లించేసిందో లెక్కలు తీయాలని ఆదేశించారు.అమరావతిలో అధికారులు కొన్ని నెల ల పాటు ఫైళ్ల తిర గేసి లెక్కలు సిద్ధం చేశారు. దీని ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లలో గత జగన్ సర్కారు రూ.196.17 కోట్లు స్థానిక సంస్థలకు ఇవ్వకుండా పంగనామాలు పెట్టినట్లు లెక్క తేల్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019-2021లో రూ.15.37 కోట్లు, 2021-2022లో రూ.89.90 కోట్లు, 2022-2023లో రూ.41.50 కోట్లు,2023-2024లో రూ.36.90 కోట్లు, 2024-2025లో రూ.12.50 కోట్లు చొప్పున సీనరేజీని ప్రభుత్వం వసూలు చేసిందని నిగ్గు తేల్చారు. వీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు ఇవ్వలేదని నివేదికలో విశ్లేషించారు.

ఏపీ ఈఏపీసెట్..

ఫలితాలు విడుదల

- జిల్లాలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీల్లో విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు
- ఫార్మసీ విభాగంలో పెద్దాపురం విద్యార్థికి 6వ ర్యాంకు, ఇంజనీరింగ్ విభాగంలో కాకినాడ నగరం విద్యార్థికి 13వ ర్యాంకు

కాకినాడ/జేఎన్‌టీయూకే, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. జిల్లాలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లా పరిధిలో ఏపీ ఈఏపీసెట్-2025 మూడు విభాగాల్లో అర్హత సాధించిన వారి వివరాలిలా ఉన్నాయి. జిల్లానుంచి అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 3,683మంది దరఖాస్తు చేసుకోగా 3,431 మంది హాజరుకాగా 3,077మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంజనీరింగ్ పరీక్షకు 8986మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8666మంది హాజరుకాగా 6343 మంది ఉత్తీర్ణత సాధించారు.

ర్యాంకులు సాధించిన వారు..

ఏపీ ఈఏపీసెట్-2025లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో కాకినాడ సూర్యారావుపేటకు చెందిన పాలకుర్తి ఆదిత్య అభిషేక్ 13వ ర్యాంకు, కాకినాడ రూరల్ మండలం పాత గైగోలుపాడుకు చెందిన గొల్లపల్లి లోషిని 72వ ర్యాంకు, బాపన్నదొర కాలనీకి చెందిన యానాల శుభశ్రీవల్లీఆత్రేయి 91వ ర్యాంకు, రాయుడుపాలేనికి చెందిన గోనెల్ల శ్రీరామశశాంక్ 95వ ర్యాంకు, సామర్లకోటకు చెందిన యలమాటి విజిత్ 96వ ర్యాంకు, శృంగవృక్షానికి చెందిన ఎలిశెట్టి పృథ్వీవీరసూర్యచక్రపవన్ 121వ ర్యాంకు, సామర్లకోటకు చెందిన మీసాల జయచంద్ర 136వ ర్యాంకు, కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన తంగెళ్ల సాత్విక్ 156వ ర్యాంకు, గొల్లపాలేనికి చెందిన తలాటం రామ్‌శ్రీసత్యపవన్ కుమార్ 169వ ర్యాంకు, కాకినాడ వెంకట్‌నగర్‌కు చెందిన చిలుకూరి సాయివర్షిత్ 170వ ర్యాంకులను సాధించారు.

● అగ్రికల్చర్ ఫార్మసీలో.. పెద్దాపురానికి చెందిన సరిదెళ్ల శ్రీశశిగోవర్ధన్ 6వర్యాంకు, తొండంగి మండలం బెండపూడికి చెందిన దేశిన సూర్యచరణ్ 10వ ర్యాంకు, కాకినాడకు చెందిన వీరంరెడ్డి సాయిభవ్యహర్షిణి 31వ ర్యాంకు, పెద్దనాపల్లికి చెందిన గొల్లపల్లి వైష్ణవి 49వ ర్యాంకు, కోటనందూరుకు చెందిన లాలం స్వామివెంకటసాయి 63వ ర్యాంకు, వలసపాకలకు చెందిన మేడపాటి మంజునాథ్ రెడ్డి 107వ ర్యాంకు, ప్రతాప్‌నగర్‌కు చెందిన ద్వారదేవీసౌమ్యశ్రీ 112వర్యాంకు, పెద్దాపురానికి చెందిన పేరిశెట్టి సాయిశ్రీధర్ 119వ ర్యాంకు, కాకినాడ గాంధీనగర్‌కు చెందిన చవ్వాకుల శ్రీవెంకటశివసాయిఅచ్యుతరామ్ 152వ ర్యాంకు, కాకినాడకు చెందిన ధర్మాన అభినవ్ 188వర్యాంకు కైవసం చేసుకున్నారు.



ఆదిత్య అభిషేక్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తా..

-పాలకుర్తి ఆదిత్య అభిషేక్, ఇంజనీరింగ్ విభాగంలో 13వర్యాంకు, కాకినాడ సిటీ

ఇంతమంచి ర్యాంకు వస్తుందని ఊహించలేదు. ఐఐటీ అడ్వాన్స్‌లో 257వ ర్యాంకు సాధించాను. ముంబయ్ ఐఐటీలో చేరాలని ఉంది. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని ఉంది. ఇంటర్ ఎంపీసీలో 475 మార్కులు వచ్చాయని తెలిపారు. నేను చదివిన కళాశాల యాజమాన్యంతోపాటు తల్లిదండ్రులు పాలకుర్తి రామకిషోర్, ధనలక్ష్మి రామకల్యాణి ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించగలిగాను.



సిరిదెళ్ల శ్రీశశిగోవర్ధన్

తల్లితండ్రుల ప్రోత్సాహంతోనే..

-సిరిదెళ్ల శ్రీశశిగోవర్ధన్, అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ విభాగంలో 6వర్యాంకు, పెద్దాపురం

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో నాకు ఆరో ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇంత మంచి ర్యాంకు వస్తుందని అసలు అనుకోలేదు. దీనికోసం నేను ఎంతో కష్టపడి చదివాను. నాకు ఈ ర్యాంకు రావడంలో నా తల్లిదండ్రుల కృషి ఎంతో ఉంది. మున్ముందు ఉన్నత విద్యలో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని అనుకుంటున్నా.

పిఠాపురంలో చెరువు మట్టి తవ్వకాల్లో వివాదం 7
- జనసేన నేతల మధ్య ఘర్షణ
- పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం 7
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- పిఠాపురం నియోజకవర్గంలో 325మందికి సేఫ్టీకిట్ల అందజేత

రత్నగిరిపై అనంతలక్ష్మి సత్రం స్థల పరిశీలన 7

పాపికొండలకు తరలివచ్చిన పర్యాటకులు 7

హెల్మెట్ ఉన్నా.. ఆగిన ఊపిరి!
- పిఠాపురంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ మృతి
- కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలు 7

డీఎస్సీ పరీక్షలకు 1,550 మంది హాజరు

కాకినాడరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా డీఎస్సీ-2025 ఆన్‌లైన్ పరీక్షలు కాకినాడ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 30 వరకూ కొనసాగనున్నాయన్నారు. జిల్లాలోని 6 కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 12వరకూ నిర్వహించిన పరీక్షకు 841 మంది హాజరు కావాల్సి ఉండగా 826మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 842 మంది హాజరు కావాల్సి ఉండగా 724మంది హాజరు కాగా మొత్తం రెండు సెషన్లకు కలిపి 1,683 మందికిగాను 1,550మంది హాజరు కాగా 133మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు సోమవారం కూడా కొనసాగుతాయన్నారు.


ప్రజల చెంతకు పాలన

పాలనలో ప్రభుత్వం నూతన ఒరవడి

- కలెక్టరేట్‌లో డీవీఏపీ యూనిట్
- నియోజకవర్గానికో యూనిట్
- 40 మంది ఉద్యోగుల నియామకం
- అభివృద్ధి, సంక్షేమ అంశాల సేకరణ
- మౌలిక వసతులు, సమస్యలపై ఆరా
- 11న ప్రారంభోత్సవాలు
- 12న ఏడాది పాలన సంబరాలు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతోంది. ఏడాది పాలన ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలనలో నూతన ఒరవడిని తెచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఈనెల 12వ తేదీకి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా అనేక కార్యక్రమాలను చేపట్టనుంది. 11న జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. 12న అమరా వతిలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సూచనల మేరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇక సోమవారం నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ యూనిట్‌ను రాష్ట్ర స్థాయిలో, డిస్ట్రిక్ట్ విజన్ యూనిట్ జిల్లాస్థాయిలోనూ, నియోజకవర్గ విజన్ యూనిట్ నియోజకవర్గ హెడ్‌క్వార్టర్‌లోనూ ప్రారంభించనున్నారు. ఒక్కో యూనిట్‌లో ఐదుగురు సచివాలయ ఉద్యోగులను నియమించారు. జిల్లా యూనిట్‌కు ఛైర్మన్‌గా కలెక్టర్ షాన్‌మోహన్ వ్యవహరిస్తారు. నియోజకవర్గ యూనిట్లకు ఎమ్మెల్యేలు ఛైర్మన్లుగా ఉంటారు. కన్వీనర్లుగా నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ఉంటారు. జిల్లాలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల హెడ్ క్వార్టర్లలోని మండల పరిషత్ కార్యాలయాల్లో నియోజకవర్గస్థాయి విజన్ యూనిట్లు ప్రారంభించనున్నారు. ఇక్కడ ఒక్కో యూనిట్‌కు ఐదుగురు వంతున సచివాలయ ఉద్యోగులు ఉంటారు. వీరిని నడిపించడానికి ఒక ప్రొఫెషనల్ ఉంటారు. మొదట వీరంతా తమ పరిధిలోని నియోజకవర్గాల్లో ఎంత జనం ఉన్నారు. ఏఏ పథకాలు ఎవరికి అందుతున్నాయి. ఇంకా అందుకోవాల్సిన వారెంతమంది అనే వివరాలు లెక్కిస్తారు. ప్రస్తుతం మండల స్థాయి వరకూ వివరాలు సేకరిస్తున్నారు. తర్వాత గ్రామస్థాయి నివేదికలు ఇవ్వనున్నారు. ప్రస్తుత నివేదికలను జిల్లా విజన్ యూనిట్‌కు ఎప్పటికప్పుడు పంపిస్తున్నారు. వీటి ఆధారంగా ప్రజల జీవన ప్రమాణాలు, వారి ఆర్థిక పరిస్థితి,ఆయా ప్రాంతాల అభివృద్ధి, సమస్యలు, తదితర వివరాలు పొందుపర్చనున్నారు. ముందుగా ఆయా మండలాల్లో జరగాల్సిన పనులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారు.



మండలస్థాయి విజన్ అమలు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మండల స్థాయి విజన్ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నాం. ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ విజన్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 40 మంది సచివాలయ ఉద్యోగులతో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2024-29కి ఐదేళ్ల మండల విజన్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. **-కలెక్టర్ షాన్‌మోహన్**

టెండర్ నోటిఫికేషన్‌లో.. స్పెషల్ రూల్స్

- వివాదాస్పదంగా ఎంఎస్ఎన్ చారిటీస్ టెండర్ల ప్రక్రియ
- కావాల్సిన వారికి మేలు చేకూర్చేందుకేనా?
- అనుమానాస్పదంగా అధికారుల తీరు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని మల్లాడి సత్యలింగ నాయకర్ ఛారిటీస్ సంస్థల్లో అభివృద్ధి పనుల కోసం పిలిచిన టెండర్లు వివాదంగా మారాయి. టెండర్ నోటిఫికేషన్‌లో స్పెషల్ రూల్స్ పెట్టడమే వివాదానికి కారణంగా తెలుస్తోంది. కావాల్సిన వారికి మేలు చేకూర్చేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ నిబంధనలు నిజమా.. కాదా అనేది అధికారులే తెలిపాలి.

రూ.1.20కోట్ల కేటాయింపు

ఎంఎస్ఎస్ఎన్ ఛారిటీస్‌లో మైదానం మెరక చేయడానికి, పచ్చదనం పెంచడానికి, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కౌడా నిధులనుంచి రూ.1.20 కోట్లు కేటాయించారు. అందులో రూ.93.79లక్షల విలువైన పనులకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. 8మంది బిడ్లు దాఖలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా మూడు మాత్రమే ఉన్నట్లు తొలుత గుర్తించారు. ఆ తర్వాత అందులో ఒక టెండరుదారుకు పూర్తి అర్హతలు లేవని అనర్హుడిగా ప్రకటించారు.

ఒకరి అభ్యంతరంతో వివాదం

ఆన్‌లైన్ టెండరు విధానంలో కొత్త పద్ధతులు తీసుకొచ్చారని, 48 గంటల్లో హార్డ్ కాపీ ఇవ్వాలని షరతు పెట్టడం సజావుగా లేదని, అయినా అందుకు తగ్గట్టుగా హార్డ్ కాపీ అందజేసినా తనను అనర్హుడిగా ప్రకటించడంపై ఒక టెండర్‌దారుడు అభ్యంతరం చెప్పడంతో వివాదం మొదలైంది. తనను ఉద్దేశపూర్వకంగా తప్పించినట్లు సదరు వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ టెండర్ల విషయంలో ముందస్తు ఒప్పందాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. దీనిపై వివాదం రేగుతున్నా ఏమీ పట్టినట్లు అధికారులు ఎవరి పని వారు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు.



బంగ్లాదేశ్‌కు.. బండరాళ్లు

- అర్ధరాత్రిళ్లు అక్రమ రవాణా
- రోడ్డు మెటల్ అనుమతితో పరిమితికి మించి లారీలపై బండరాళ్ల తరలింపు
- పంజాబ్ వ్యాపారి పనేనా?
- క్వారీ యాజమానులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు కాసులు కురిపిస్తున్న వైనం

క్వారీ నుంచి తరలివెళ్తున్న బండరాళ్లు(ఫైల్)

రౌతులపూడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన రౌతులపూడిలోని క్వారీల నుంచి బండరాళ్లు కాకినాడ పోర్టు మీదుగా బంగ్లాదేశ్ తరలిపోతున్నాయి. అనుమతులు లేని క్వారీలనుంచి కూడా అర్ధరాత్రిళ్లు వీటిని తరలించి వేస్తుండడం విశేషం. రోడ్డ మెటల్ అనుమతితో ఈ బండరాళ్ల తరలింపు జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలోని రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాల, మూలగపూడి, ఉప్పంపాలెం, మల్లంపేట గ్రామాల్లో 1,15 సర్వే నెంబర్లలో నల్లరాయి క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల్లో కేవలం రహదారులకు నల్లమెటల్ తరలించేందుకే అనుమతి తీసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకపోయినా బండరాళ్లను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ రాళ్లను పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఓ మాజీ పోర్టు ఉన్నతాధికారి కుమారుడు బంగ్లాదేశ్‌కు తరలిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాల, మూలగపూడి, ఉప్పంపాలెం క్వారీలనుంచి భారీ వాహనాల్లో కాకినాడ పోర్టుకు తరలించి అక్కడ నుంచి బంగ్లాదేశ్‌కు తరలిస్తున్నట్టు సమాచారం. బండరాయికి గిరాకీ ఉండడంతో అనుమతి ఉన్న క్వారీల యాజమానులు, అనుమతి లేని క్వారీ యజమానులు బండరాళ్ల వ్యాపారమే చేస్తున్నారు. అనుమతి పొందిన క్వారీల నుంచి పగలు లారీల్లో రాళ్లను తరలిస్తుండగా, అనుమతి లేని క్వారీల్లో రాళ్లను రాత్రి పది గంటలు దాటిన తర్వాత తరలిస్తున్నారు. లారీలపై పెద్దపెద్ద బండరాళ్లను వేసి తరలిస్తున్న సమయంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక్కోసారి లారీలపై నుంచి రాళ్లు పడిపోతున్నాయి. రాళ్లు తరలించే సమయంలో కనీసం టార్పాలిన్లు కూడా కప్పడం లేదు. బండరాళ్ల వ్యాపారం కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, క్వారీ యజమానులకు కాసులు కురిపిస్తున్నట్టు సమాచారం. గత వైసీపీ పాలనలో బండరాళ్ల వ్యాపారానికి తెర తీశారు. ప్రస్తుతం కూడా ఆ పార్టీ వాళ్లకి వాటాలు ఉండడంతో ఈ వ్యాపారం పుష్కలంగా నడుస్తున్నట్టు సమాచారం. రహదారిలో పరిమితికి మించి లారీలు తిరగడంతో రోడ్లు నాశనవుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రహదారి ఛిద్రం కావడంతో తుని నియోజకవర్గం తేటగుంటలో లారీలను గ్రామస్తులు అడ్డుకోవడంతో రౌతులపూడి, కత్తిపూడి మీదుగా లారీలు కాకినాడ పోర్టుకు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ తరలింపులపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.





దుమ్మెత్తిపోతోంది!



- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

» దారుణంగా రాజమహేంద్రవరం - మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డు » ప్రజలకు అవస్థలు

రాజమహేంద్రవరం- మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డు పరిస్థితి దుమ్ము, ధూళితో నానాటికి దారుణంగా మారుతోంది. కోటిలింగాల ఇసుక ర్యాంప్‌ల నుంచి వచ్చే భారీ లారీల దెబ్బకు తారు రోడ్డు కాస్తా మట్టి, ఇసుక పర్రలా మారిపోతోంది. ద్విచక్ర వాహనదారులు ఇసుక దారిలో జారి పడి గాయాలపాలవుతున్నారు. ఆర్టీసీ, ప్రవేట్ ట్రావెల్స్ బస్సులు ఈ రోడ్డుగుండానే ఎక్కువగా వెళ్తుంటాయి. ఇసుక లోడు లారీలు ఫుల్‌గా లోడ్ వేసుకుని వస్తూ దారిలో ఇసుకను వేస్తున్నాయి. అది రోడ్డుపై ఇతర వాహనాల కింద నలిగి మట్టిగా మారిపోయి రోడ్డంతా దుమ్ముతో నిండిపోతోంది. ఈ దుమ్ము వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఉంది. రోజు రోడ్డు పక్కన ఉన్న వ్యాపారస్తులు, గృహాల్లో ఉండేవారు ఉదయం, సాయంత్రం బాకెట్లతో మట్టిని ఎత్తుకుని పారబోసే పరిస్థితి ఉంది. ద్విచక్రవాహనదారులు దుమ్ములో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నారు. రోడ్డులో దుమ్ము, ఇసుక కళ్లల్లో పడి అవస్థలు పడుతున్నామని, రెప్పపాటులో ప్రమాదాలు జరిగే అవకాశంఉందని భయాందోళన చెందుతున్నారు.

సీలేరు నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మోతుగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో కొట్టుకుపోయిన అభిలాష్ (18) మృతదేహం ధారాలమ్మ గుడి వెనక నదిలో ఆదివారం లభ్యమైంది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి గజ ఈతగాళ్లతో మోతుగూడెం ఎస్ఐ సాధిక్, పోలీసు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, ఆర్ఐ విగ్నేష్, వీఆర్వో రెవెన్యూ సిబ్బందితో గాలింపు చేపట్టగా ఆదివారం మధ్యాహ్నం నదిలోని రాళ్ల మధ్యలో ఇరుక్కుపోయిన యువకుడి మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకువచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సాధిక్ తెలిపారు. ప్రస్తుతం సీలేరు నది ప్రవాహం ఎక్కువ తక్కువ అవుతున్న కారణంగా సాధ్యమైనంత వరకు నదిలో దిగడం, ఈత కొట్టడం మానుకోవాలని పర్యాటకులకు ఆయన సూచించారు.


అభిలాష్ మృతదేహం

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మోతుగూడెంలో పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ డి.కామేశ్వరరావు ఆదేశాల ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ ఏడీఈ కొండబాబు పర్యవేక్షణలో పొల్లూరు సివిల్ అధికారులు ఆదివారం సాయంత్రం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ నది తీరంలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో లోయర్ సీలేరు ఏపీ జెన్కో సివిల్ డివిజన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధారాలమ్మ గుడి వద్ద సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఏపీఈఏపీసెట్ ఫలితాలు విడుదల

- ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్‌లో అర్హత సాధించిన 15,220మంది విద్యార్థులు
- అగ్రికల్చర్ ఫార్మసీలో అర్హులైన 6,710 మంది విద్యార్థులు
- ఫలితాలను విడుదల చేసిన సెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూన్8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2025 ఫలితాలను సెట్ చైర్మన్, ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఇంజనీరింగ్‌లో మొత్తం 15,220 మంది ఉత్తీర్ణత సాధించగా.... అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలో 6,710మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 3,683మంది దరఖాస్తు చేసుకోగా 3,431 మంది హాజరుకాగా 3,077మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 2585మంది దరఖాస్తుచేసుకోగా 2387 మంది హాజరుకాగా 2249 మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 1601 మంది దరఖాస్తు చేసుకోగా 1510 మంది హాజరుకాగా 1384 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కాకినాడ జిల్లాలో ఇంజనీరింగ్ పరీక్షకు 8986 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8666 మంది హాజరుకాగా 6343 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్ పరీక్షకు 7649 మంది దరఖాస్తు చేసుకోగా 7416 మంది హాజరుకాగా 6011మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో ఇంజనీరింగ్‌లో పరీక్షకు 4,036 మంది దరఖాస్తుచేసుకోగా 3,891 మంది హాజరుకాగా 2,866 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వీవీ సుబ్బారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, కన్వీనర్లు రాము, సుమతి, సమన్వయకర్తలు చంద్రశేఖర్, జయప్రసాద్, ఉషాదేవి పాల్గొన్నారు.

కవలలకు ర్యాంకులు


వేజిత్, వేహితలకు మిఠాయిలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కొత్తూరు వీధికి చెందిన ఉపాధ్యాయులు యలమాటి శ్రీనివాసు-అరుణ దంపతుల కుమారుడు వేజిత్‌కు ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 96వ ర్యాంకు, కుమార్తె వేహితకు 172 ర్యాంకు లభించింది. వీరిద్దరూ కవలలు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు రావడంతో ఐఐటీలో చేరేందుకు మక్కువ కనబరుస్తున్నారని తల్లిదండ్రులు చెప్పారు.

ఊపిరితిత్తుల సమస్యతో గిరిజన బాలిక మృతి


సంధ్య (ఫైల్)

ఎటపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్య (ఇన్‌ఫెక్షన్)తో గిరిజన బాలిక మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాడే సంధ్య (13) గత నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతుంది. బాలిక పట్ల తల్లిదండ్రులు నాటు మందు ఇచ్చేవాడిని ఆశ్రయించారు. బాలికకు అప్పుడప్పుడు జ్వరం రావడంతో ఆర్ఎంపీల వద్ద తరచూ చికిత్స చేయించడంతో కిడ్నీ సమస్య కూడా వచ్చినట్టు తెలిసింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో భద్రాచలం, ఖమ్మం, హైదారాబాద్‌కు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. బాలిక చింతూరు ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్‌లో ఏడో తరగతి పూర్తి చేసింది.

కరెంటుషాక్‌తో యువకుడి మృతి!

కొత్తపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం తీరప్రాంతంలో ప్రముఖ కంపెనీలో యువకుడు కరెంటు షాక్‌తో మృతిచెందినట్టు తెలిసింది. కేఎస్ఈజెడ్‌లో రొయ్యల శుద్ధి చేసే కంపెనీలో కూలీపనులు చేస్తున్న ఒక యువకునికి కరెంటు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడనేది సమాచారం. కంపెనీ ప్రతినిధులు గుట్టు చప్పుడు కాకుండా మృతుడి బంధువులకు అప్పగించారని సమాచారం. దీనిపై కొత్తపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదురాలేదని ఎస్ఐ జివెంకటేష్ తెలిపారు.

హెల్మెట్ ఉన్నా..ఆగిన ఊపిరి!

ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ మృతి

కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలు


మరణించిన మమత (ఫైల్)

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మహిళ మరణించగా కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ హెల్మెట్ పెట్టుకున్నప్పటికీ కింద బెల్ట్ పెట్టుకోకపోవడంతో తలకు గాయాలై చనిపోయింది. బెల్ట్ పెట్టుకోకపోవడంతో హెల్మెట్ ఊడిపోయి తలకు బలమైన గాయాలైనట్టు పోలీసులు గుర్తించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన ఇంటి మమత(32) గొల్లప్రోలులోని మాధురి విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడు సుహాస్ (8), సోదరి జగ్గంపేటకు చెందిన పెనుమర్తి సోమలత(17)తో కలసి దుర్గాడ నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. కాకినాడలో దంత పరీక్షల నిమిత్తం వైద్యుడి వద్ద అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్తుండగా రాపర్తి జంక్షన్ సమీపంలో గేదె అడ్డుగా రావడంతో అదుపు తప్పి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన మమత అక్కడిక్కడే మరణించగా, సుహాస్, సోమలతకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. మమత భర్త నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తున్నారు. మమత సహచర ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పిఠాపురం ఎస్ఐ మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఈఏపీసెట్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీఈఏపీ సెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ) ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, 8వ ర్యాంకు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ స్టేట్ 3వ ర్యాంకు, ఎ.శ్రీహర్ష 20వ ర్యాంకు, కె.యశ్వంత్ రాజా 26వ ర్యాంకు, సీహెచ్ సాయి కేశవరామ్ 27వ ర్యాంకు, వి.తేజశ్రీ 31వ ర్యాంకు, కె.ప్రణీత్ 36వ ర్యాంకు, బి.సాయి శ్రీకర్ 66వ ర్యాంకు, కె.శంకర్ మానిక్ 77వ ర్యాంకు, కె.వినీష్ 93 ర్యాంకు... 100లోపు 9, 1000లోపు 142, 2000లోపు 280, 5000లోపు 626, 10000లోపు 1012 మంది సాధించారని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ విభాగంలో డి.కిరీటి స్టేట్ 8వ ర్యాంకు, ఎం.సంతోష్ రెడ్డి 12వ ర్యాంకు, ఎల్.అభిషేక్ 39వ ర్యాంకు, కె.నాగసాయిపవన్ 47వ ర్యాంకు, టి.సాహితి 55వ ర్యాంకు, కె.కశ్యప్ 58వ ర్యాంకు, పి.దినేష్ 73వ ర్యాంకు, టి.రామచంద్రన్ 77వ ర్యాంకు, ఎం.వైష్ణవి 81వ ర్యాంకు కైవసం చేసుకున్నారని.. 100లోపు 9 మంది, 1000 లోపు 85 మంది, 2000లోపు 140 మంది, 5000లోపు 272 మంది, 10000లోపు 415 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.



ఉన్నత ర్యాంకులు సాధించిన కె.సాత్విక్, డి.కిరీటి

ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం నియోజకవర్గంలో 325మందికి సేఫ్టీకిట్ల అందజేత


మంగళగిరిలో ఎలక్ట్రీషియన్లకు సేఫ్టీ కిట్లు అందజేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలపణంగా పెట్టి పనిచేసే ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం పిఠాపురం నియోజకవర్గంలోని 325 మంది ప్రవేటు ఎలక్ట్రీషియన్లకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత కోసం సేఫ్టీకిట్లను అందజేశారు. ఒక్కొక్కటి రూ.5వేలు విలువ చేసే ఈ సేఫ్టీకిట్‌లో ఎలక్ట్రికల్ పనులకు అవసరమైన టూల్‌కిట్, రబ్బర్ హ్యాండ్ గ్లోవ్స్, షూస్, జాకెట్లు ఉండగా వీటన్నింటిని పవన్ తన సొంత నిధులతో సమకూర్చారు. అనంతరం మాట్లాడుతూ ఏప్రిల్‌లో పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే దళిత యువకుడు పల్లపు సురేష్ ఒకరి ఇంటిలో కరెంటు పనిచేస్తూ మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. అతడి మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి నిరాధరమైందన్నారు. సురేష్ మరణం వెనుక ఉన్న కారణాలు పరిశీలిస్తే పేదరికం, విద్యుత్ పనులు చేసేటప్పుడు అతడి వద్ద రక్షణ పరికరాలు లేకపోవడంగా గుర్తించామని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదనే లక్ష్యంతో తన సొంత నిధులతో ప్రవేటు ఎలక్ట్రీషియన్లందరికీ రక్షణ పరికరాల కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. సురేష్ కుటుంబానికి ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2లక్షలు, చంద్రన్న బీమా ద్వారా రూ.2లక్షలు అందించే ఏర్పాటు చేశామని పవన్ చెప్పారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి 3 నెలలకు ఒకసారి పిఠాపురం నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పంచాయతీరాజ్ కమిషనరు కృష్ణతేజ, పిఠాపురం కమిషనరు కనకారావు పాల్గొన్నారు.

చెరువు మట్టి తవ్వకాల్లో వివాదం

జనసేన నేతల మధ్య ఘర్షణ

పిఠాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాల పరిధిలో ఉన్న పాపిడిదొడ్డి చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో ఆదివారం వివాదం జరిగింది. జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చెరువులో మట్టి తవ్వకాలకు ఒక మహిళా రైతు పేరుపై అనుమతి తీసుకువచ్చి కొన్ని రోజులుగా తవ్వకాలు సాగిస్తూ మట్టిని విరవాడ, ఎల్ఎన్‌పురం, నరసింగపురం, కోలంక, విరవ తదితర గ్రామాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇటుకబట్టీల తరలింపు విషయంలో జనసేన నాయకుల మధ్య వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి విరవ గ్రామానికి చెందిన పిఠాపురం మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు చేరుకున్నారు. తవ్వకాలు సాగుతున్న తీరు సరిగా లేదని, గడువు ముగుస్తున్నా అన్ని ప్రాంతాలకు మట్టి సరఫరా చేయడం లేదని అభ్యంతరం తెలిపారు. అదే సమయంలో దీనికి విరవాడ గ్రామానికి చెందిన బొజ్జా రాంప్రసాద్ అభ్యంతరం చెబుతూ వాగ్వావాదానికి దిగారు. ఇది ఇరువర్గాల ఘర్షణకు దారి తీసి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

దీనిపై ఇరువురు తమపై దాడి జరిగిందని, బంగారు వస్తువులు పోయాయని పరస్పరం పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఫిర్యాదులు అందాయని, విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్ఐ జానీభాషా తెలిపారు. కాగా మట్టి తవ్వకాల వద్ద జనసేన నాయకులు బహిరంగంగా ఘర్షణకు దిగడం పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

రత్నగిరిపై అనంతలక్ష్మి సత్రం స్థల పరిశీలన


సత్రం స్థల పరిశీలన చేస్తున్న చీఫ్ ఇంజనీర్

అన్నవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో రూ.11.40 కోట్లతో 105 గదులతో నిర్మించబోయే అనంతలక్ష్మి సత్రం స్థలాన్ని ఆదివారం దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్ పరిశీలించారు. ఇప్పటికే టెండర్లు పిలవగా అనుమతి కోసం దేవదాయకమిషనర్‌కు లేఖ రాయడంతో కమిషనర్ ఆదేశాలతో పరిశీలించారు. దీనిపై నివేదికను కమిషనర్‌కు అందజేసి తదనంతర ఆదేశాలతో టెండర్‌ను ఖరారు చేయనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సీతారామ సత్రం పడగొట్టి ఆ ప్రాంతంలో కొత్త నిర్మాణం చేపట్టాలని టెండర్లు పిలిచారు. అయితే సీతారామ సత్రం పడగొట్టకుండా మరమ్మతులు చేపడితే సరిపోతుందని దేవదాయశాఖ ఇంజనీరింగ్ బృందం సూచించింది. దీంతో ఆ భవనం అలానే ఉంచి నూతనంగా వేరే ప్రదేశంలో నిర్మించాలని సూచించారు. దీంతో సత్యగిరి కొండపై నిర్మించాలని సూచించారు. ఈమేరకు విష్ణుసదన్ హాల్స్ ఎదురుగా నిర్మించాలని నిర్ణయించారు.

వివాదాస్పదమైన వివాహ డెకరేషన్ మండపం ఏర్పాటు

సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఉదయం వివాహం చేసుకునేందుకు ఒక బృందం 2రోజుల క్రితం డెకరేషన్ మండపాల లీజుదారులను కలవగా వారు చెప్పిన ధరకు అంగీకరించపోవడంతో ఇతర ప్రాంతం నుంచి డెకరేషన్ మండపాన్ని తెప్పించుకోగా లీజుదారులు అడ్డుకున్నారు. తాము నిర్ణీత మొత్తం దేవస్థానానికి చెల్లిస్తున్నామని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వివాదం ఈవో దృష్టికి చేరడంతో బయట నుంచి డెకరేషన్ మండపం ఏర్పాటు చేసుకుంటే నిర్ణీత రుసుం పెళ్లి బృందం వద్ద తీసుకుని అనుమతించాలని చెప్పడంతో వివాదం ఆగింది.

పాపికొండలకు తరలివచ్చిన పర్యాటకులు


పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పాపికొండల అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. దేవీపట్నం మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మడిపల్లి, మంటూరు, కచ్చులూరు, కె.గొందూరు, నడిపూడి తదితర గ్రామాల మీదుగా నాలుగు బోట్లలో 260మంది పాపికొండలకు వెళ్లారు. పేరంటాలపల్లిలో సందడి చేసి వెనుదిరిగారు. ముందుగా గండిపోశమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరిలోకి వెళ్లకుండా రేవుల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

లోవ దేవస్థానానికి రూ.6.60 లక్షల ఆదాయం

తుని రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.6.60 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో వి.విశ్వనాధ్‌రాజు తెలిపారు.


ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట భీమేశ్వరాలయానికి చెన్నై హైకోర్టు జడ్జి ఎస్.మాల, కమిషనరు ఆఫ్ యూత్ సర్వీసెస్ (విజయవాడ) కె.శారద ఆదివారం విచ్చేశారు. వారికి ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన జరిపారు. నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.


వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'సెస్ నిధుల దోపిడీ ఆపాలి'

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ కనస్ట్రక్షన్‌లో వసూలు చేస్తున్న సెస్ నిధుల దోపిడీ ఆపాలని ఏపీ బిల్డింగ్, కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం వీర్‌కమల్ థియేటర్ వద్ద కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం టి.అన్నవరం అధ్యక్షతన జరిగింది. ఎం. దుర్గాప్రసాద్, టి.శ్రీనివాస్, శేఖర్, జి.సత్యనారాయణ, వెంకటేష్, కుమార్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంగలక్ష్మి

కొలువుదీరిన పెద్దాపురం మార్కెట్ కమిటీ పాలకవర్గం

పెద్దాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం సెక్రటరీ తోట శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, చైర్‌పర్సన్‌గా నూనె మంగలక్ష్మి, వైస్ చైర్మన్‌గా మదిరెడ్డి చంద్రశేఖర్, డైరెక్టర్లుగా చాగంటి వరలక్ష్మి, గోలి దేవి, గురజాలపు దుర్గా భవాని, గుత్తుల సూర్యావతి, జల్దాని సుబ్రహ్మణ్యం, కొమ్మిరెడ్డి వీరసత్యవేణి, రేలంగి వెంకట్రావు, సైనం సాల్మన్‌రాజు, తలాటం నాగబాబు, త్సలికి దుర్గ, అమలదాసు ఏసుబాబు, గాదంశెట్టి శ్రీనివాస్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో నూనె రామారావు, ఏఎంసీ సిబ్బంది కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 2005-07 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు అదే కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. 18 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు చదువుకున్న రోజుల్లో తాము చేసిన అల్లరి పనులు, లెక్చరర్ల మందలింపులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన వారు భారమెక్కిన హృదయాలతో పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు. ప్రతిఏటా ఇదే మాదిరిగా కలవాలని నిర్ణయించుకున్నారు.



రాజరాజేశ్వరీ తన్విని సత్కరిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

'సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుంటాం'

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) సేవా కార్యక్రమాల నిర్వహణలో వాసవి క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని జిల్లా గవర్నర్ మానేపల్లి బంగార్రాజు తెలిపారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో రామకృష్ణ కల్యాణమండపం వద్ద మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ, పేదలకు దుస్తుల పంపిణీ, మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రెండో సాధించిన అప్పన్న రాజరాజేశ్వరీ తన్విని సత్కరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు వెలగా వెంకట నగేష్, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు కేదారశెట్టి అప్పలరాజు, చిట్టూరి సురేష్‌కుమార్, సూర్యప్రకాష్, సతీష్, భాను, కొత్త దేవ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

రోటరీ ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణానికి శంకుస్థాపన

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నగరంలోని కొండయ్యపాలెం బ్రిడ్జి మిలటరీ రోడ్ వద్ద రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఐలాండ్ నిర్మాణానికి రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీరభద్రారెడ్డి, రోటరీ ట్రాఫిక్ ఐలాండ్ ప్రాజెక్టు చైర్మన్ షైలపల్లి విద్యాసాగర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఐలాండ్ డిజైనర్ ఇంజనీర్ కృష్ణప్రసాద్, పోలిశెట్టి ఈశ్వరరావు, సిస్టల శ్రీకాంత్, బంగారు కృష్ణమోహన్, కోరుమిల్లి బాలప్రసాద్, బోడా ఆనంద్‌విజయ్‌బాబు, హరిబాబు, అనుపమ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'అగ్రిగోల్డ్ బాధితులపట్ల ఉదాసీనత చూపితే ఆందోళన'

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల పట్ల ప్రభుత్వం ఉదాసీనత చూపిస్తే మరోసారి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు హెచ్చరించారు. అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నగరంలోని గాంధీ భవన్‌లో అగ్రి గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసురావు అధ్యక్షతన జరిగింది. మధు మాట్లాడుతూ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డబ్బు చెల్లించాలన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు చివరి రూపాయి అందేవరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. బాధితులకు అందాల్సిన మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ నగర శాఖ అధ్యక్షుడు నక్క కిషోర్, జిల్లా కార్యదర్శి బొమ్మేటి రాంబాబు, గౌరవాధ్యక్షుడు వైకే రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి చంద్రశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవఖండ్రవాడ నక్కుళ్లమ్మ చెరువు గట్టుపై నాటుసారా తయారీ బట్టీలపై ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు వి.రేణుక ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 104 లీటర్ల నాటుసారా, 150 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. శాంతివారిపాకలుకు చెందిన గీసాల అప్పన్న, అనసూరి వీరబాబులను అరెస్టు చేశారు. పిఠాపురం కత్తులగూడేనికి చెందిన తోడాల లక్ష్మిని అరెస్టు చేసి 9 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కల్యాణి, సిబ్బంది రమణ, శేషగిరి, దేవి, పిఠాపురం ఎస్ఐ విజయకుమార్, హెచ్‌సీ సూర్యచంద్రరావు, లక్ష్మి, మన్నెబ్బాయి పాల్గొన్నారు.

'వ్యాపారులకు అండగా కూటమి ప్రభుత్వం'

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ భవన నిర్మాణం పూర్తయ్యేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అధ్యక్షుడిగా గ్రంధి నారాయణరావు (బాబ్జీ), కార్యదర్శిగా పసుమర్తి కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారిగా గుర్రం సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జాలుమూరి నానాజీ, వై.వెంకటేష్, యక్కల ప్రసాదరావు, రేపాక సత్యనారాయణ, డేగల రమేష్, కర్రి సుధాకరరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా నల్లం వరహాలబాబు, నెక్కంటి శ్రీనివాస్, పులవర్తి సీతారామమూర్తి, శ్రీకాకోళపు నరేష్, చిట్టూరి రత్నగీతార్థ, పీఆర్వోగా సిరి శ్రీనివాసరావు, బిల్డింగ్ కనస్ట్రక్షన్ కమిటీ చైర్మన్‌గా బాదం బాలకృష్ణ, కో-చైర్మన్‌గా గొల్లపూడి సుందరకుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అధ్యక్షుడు బాబ్జీ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను పూర్తిగా నెరవేరుస్తూ అందరి సహకారంతో భవన నిర్మాణం పూర్తి చేస్తానన్నారు. కార్యక్ర మంలో కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, ప్రముఖులు సోము ప్రసాద్, కర్రి నారాయణరావు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ త్రీటౌన్ సీఐ సత్యనారాయణరావుకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ మహిళా విభాగం ప్రతినిధులు



సామర్లకోటలో సీఐ కృష్ణభగవాన్‌కు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు, కౌన్సిలర్లు

సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి, ఆ ప్రాంత మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు ప్రసారం చేసిన సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సాక్షి టీవీలో కొమ్మినేని శ్రీనివాసరావు లైవ్ ప్రసారంలో విశ్లేషకుడు వాడపల్లి కృష్ణంరాజు అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించడం చాలా సిగ్గుచేటన్నారు. ఇది కేవలం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రోద్బలంతోనే అమరావతి ప్రతిష్టను దిగజార్చేందుకు జరిగిన కుట్ర అన్నారు. అదే ప్రాంతంలో ఆయన సతీమణి భారతిరెడ్డి కూడా నివాసం ఉంటున్నారనే విషయం గ్రహించాలన్నారు. మహిళలకు జగన్ తక్షణం భేషరతుగా క్షమాపణ చెప్పాలని కొండబాబు డిమాండ్ చేశారు.

కాకినాడ క్రైం (ఆంధ్రజ్యోతి): మహిళల గౌరవాన్ని కించపరిచేలా సాక్షి మీడియాలో వచ్చిన వ్యాఖ్యలను నిరసిస్తూ తెలుగు మహిళలు కొల్లు కుమారి, పీర్ల లక్ష్మీప్రసన్న, దేవు జయలక్ష్మి, పలివెల లక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సాక్షి యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని కోరుతూ సీఐ కేవీ సత్యనారాయణకు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు వడిశెల దాలమ్మ, రిక్కా లక్ష్మి, మూగు చిన్న, ఎల్లయ్యమ్మ, రాణి, బుర్ర అప్పలనరసమ్మ, పొంగ సత్య, రవణమ్మ, బత్తిన ఉమా, సత్య రమ్య, రమాదేవి, రామలక్ష్మి పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరచడంపై తెలుగు మహిళలు సామర్లకోట పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ అంశంలో సాక్షి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ కృష్ణభగవాన్‌కు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్లు జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి, తెలుగు మహిళలు బొందల రామలక్ష్మి, చవ్వేటి సౌదామణి, దేవళ్ల జయలక్ష్మి, చవ్వేటి మయూరి, కోనా గౌరి, ఎస్.గీత, గంగా భవాని, మొండి లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.



కాకినాడ రూరల్ వలసపాకలలో...

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంత మహిళలను అవమానపరిచేలా ప్రచారం చేసిన సాక్షి మీడియా అధినేత్రి భారతిరెడ్డి, జగన్ మహిళ లోకానికి క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్ వలసపాకలలోని వారి నివాసం వద్ద కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చిత్రపటాలను తెలుగు మహిళలు తగులబెట్టారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి, పలివెల గాయిత్రి, లక్ష్మి, వెంకటరమణమ్మ, కోమలకుమారి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న రాజప్ప దంపతులు

టీడీపీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

పెద్దాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుధా కాలనీలో బీసీ హాస్టల్ సమీపంలో టీడీపీ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సతీసమేతంగా ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చేబ్రోలులో ఉచిత వైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో షైనేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు డాక్టర్ రవికాంత్, డాక్టర్ శివ, మణికుమార్, డాక్టర్ భార్గవి, శాంతి, దేవి, సత్య పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతారాములు, గణపతి, సాయి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. న్యాయవాది కుంటముక్కల సాయిరంగ భాస్కర్-సత్యవేణి దంపతులు కర్తలుగా పాల్గొనగా ఆకొండి శివరామశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

కుళ్లిన మాంసం విక్రయాల అడ్డగింత

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటకృష్ణరాయపురంలో మాంసం వ్యాపారి రొట్టా వీర్రాజు ఆదివారం నిల్వ ఉన్న కుళ్లిన మాంసాన్ని విక్రయిస్తుండగా స్థానిక రైతు నాయకుడు రమేష్ అడ్డుకున్నారు. సదరు వ్యాపారి ఎదురు తిరగడంతో ఆయన ఈ విషయాన్ని ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికే గ్రామస్థులు పెద్ద ఎత్తున గుమిగూడడంతో ముందు జాగ్రత్త చర్యగా పంచాయతీ అధికారులు నిల్వ ఉన్న కుళ్లిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి చిరునామా సేకరించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు మాంసాన్ని విశ్లేషణ నిమిత్తం అందజేసి సోమవారం తదుపరి చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన నక్కా పాండురంగారావు పొలంలో పని చేస్తుండగా పాముకాటుకి గురై మరణించాడు. దీంతో ఆయన కుమార్తె రమ్యశ్రీ పదో తరగతి చదువుకు ఆటంకం కలిగింది. ఆమె తల్లి తమ పరిస్థితిని శ్రీయువసేనకు వివరించగా శ్రీయువసేన సతీష్ ఈ విషయాన్ని అనపర్తి నియోజకవర్గం మహేంద్రవాడకు చెందిన సబ్బెళ్ల జానకి రామరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సహకారం కోరారు. జానకిరామరెడ్డి తన సతీమణి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థిని పదో తరగతి చదువు మొత్తానికి అయ్యే ఖర్చు రూ. 32,500ను శ్రీయువసేన సతీష్ ద్వారా అందజేశారు.



రమ్యశ్రీకి సహాయం అందజేస్తున్న సతీష్

శివారెడ్డికి సత్కారం

కాకినాడ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఆయన్ను ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ సత్కరించి వేంకటేశ్వరస్వామి ఫొటో అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం, కాకినాడ టౌన్ ఉపాధ్యక్షుడు నరేష్, రాజమండ్రి యూనిట్ కార్యదర్శి ఎస్.ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాఘవ, మండపేట యూనిట్ అధ్యక్షుడు మల్లికార్జునుడు, జిల్లాలోని వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



శివారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

'మనిషి లోపలి చీకటిని అన్వేషించిన కాశీభట్ల'

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీభవన్‌లో ఆదివారం కేంద్ర సాహిత్య అకాడమీ 'నా దృష్టిలో' కార్యక్రమం నిర్వహించింది. ప్రసిద్ధ కవి, నవలా రచయిత కాశీభట్ల వేణుగోపాల్ జీవితం, రచనలను విశదీకరిస్తూ ప్రముఖ కవి, విమర్శకుడు, కథా రచయిత జి.వెంకటకృష్ణ విజ్ఞానవంతమైన ప్రసంగం చేశారు. నగరానికి చెందిన సాహితీ ప్రముఖులు హాజరై సభకు శోభ తెచ్చారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు, కార్యక్రమ నిర్వాహకుడైన ప్రసేన్ తన సందర్భోచితమైన పరిచయ వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రముఖ అతిథులను హృదయపూర్వకంగా స్వాగతించారు. తన వ్యాఖ్యానంలో ప్రసేన్... వేణుగోపాల్ సాహిత్య రచనల గురించి సంక్షిప్తమైన, గాఢమైన అవలోకనాన్ని అందించారు. మానవ స్వభావంలోని చీకటి వెలుగులను, మానవ అంతరాత్మలోని సంక్లిష్ట సూక్ష్మభేదాలను వేణుగోపాల్ నైపుణ్యంతో అన్వేషించారన్నారు. వేణుగోపాల్ జీవితం, సాహిత్య కృషిపై వెంకటకృష్ణ సమగ్ర ప్రసంగం చేశారు. డాక్టర్ కాళ్లకూరి శైలజ, అద్దేపల్లి ప్రభు తదితర ప్రముఖ సాహితీవేత్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

విష్ణ్వాలయం ప్రాకార మండపం పనులు ప్రారంభం

గొల్లప్రోలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని సీతారామస్వామి దేవస్థానం (విష్ణ్వాలయం)లో ప్రాకార మండపం నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. రూ.1.32 కోట్ల వ్యయంతో ఈ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గతంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, పేకేటి నాగేశ్వరరావు, జనసేన, టీడీపీ నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, గుండ్ర సుబ్బారావు, కడారి బాబ్జీ, బస్సా చిట్టిబాబు, పర్ల రాజా, బలిరెడ్డి గంగబాబు, కేదారశెట్టి నానాజీ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఆదివారం విడుదలైన ఏపీఈఏపీ సెట్‌లో కాకినాడ జిల్లా వాసులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. అందులో కొందరికి ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లోనూ మెరుగైన ర్యాంకులు వచ్చాయి. దీంతో ఐఐటీల్లోనే చేరతామంటున్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే రాణించామని 'ఆంధ్రజ్యోతి'తో తమ మనోగతాన్ని పంచుకున్నారు.



లోషిణికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు మహేష్, భువనేశ్వరి

లోషిణి ... 72వ ర్యాంకు

కాకినాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం పాత గైగోలుపాడుకు చెందిన గొల్లపల్లి లోషిణి ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 72వ ర్యాంకు సాధించింది. తల్లి భువనేశ్వరి గొడారిగుంట హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ కాగా తండ్రి మహేష్‌బాబు రాజమహేంద్రవరంలో ఓ వర్క్‌షాపులో పనిచేస్తారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో 1100 ర్యాంకు రావడంతో మద్రాస్ ఐఐటీలో చేరి ఏఐ అండ్ డేటా సైన్స్ ఇంజనీరింగ్ చేయడమే తన లక్ష్యం అంటోంది.



తల్లిదండ్రులతో శుభశ్రీవల్లీఆత్రేయి

శుభశ్రీవల్లీఆత్రేయి... 91వ ర్యాంకు

కాకినాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బాపన్నదొర కాలనీకి చెందిన యానాల శుభశ్రీవల్లీఆత్రేయి ఇంజనీరింగ్ విభాగంలో 91వ ర్యాంకు సాధించింది. తండ్రి సాయికృష్ణ ఎస్‌బీఐ కాకినాడ మెయిన్ బ్రాంచిలో, తల్లి అచ్చియమ్మ పండ్రవాడ ఎంపీయూపీ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 296వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో 359 ర్యాంకు వచ్చింది. ఐఐటీ ముంబయిలో సీఎస్ఈలో సీటు వచ్చే అవకాశం ఉందంటోంది శుభశ్రీ.



తల్లిదండ్రులతో జయచంద్ర

జయచంద్ర... 136వ ర్యాంకు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మీసాల జయచంద్ర ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 136వ ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 169వ ర్యాంకు వచ్చినందున ముంబయి ఐఐటీలో సీఎస్ఈలో చేరనున్నట్టు అతడి తల్లిదండ్రులు రమణమూర్తి, రత్నకుమారి చెప్పారు. తండ్రి ప్రైవేట్ ఉద్యోగి కాగా తల్లి గృహిణి.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో వార్షిక మరమ్మతులు, స్తంభాలు, విద్యుత్ తీగల ఏర్పాటు, ట్రీకటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా సోమ, మంగళవారాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏఏస్ఏఓ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. ఈ కారణంగా ఉప్పువారి సత్రం, అంబేద్కర్ పార్కు, టిడ్కో గృహాల సముదాయం, పిఠాపురం రోడ్డు, జల్లూరు వ్యవసాయ ఫీడరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

వైభవంగా పాదాలమ్మ జాతర



గొల్లప్రోలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పాదాలమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. సాయంత్రం ఆలయం వద్ద తీర్థం జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రౌతులపూడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సోమవారం రౌతులపూడి సబ్‌స్టేషన్‌పరిధిలో 11కేవీ రూరల్ ఫీడర్ రౌతులపూడి, పి.చామవరం, మెరకచామవరం, శృంగవరం గ్రామాలకు లైన్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9గంటల నుంచి2గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని డిప్యూటీ ఇంజనీర్ ఎం.రాఖశేఖర్ ప్రకటనలో కోరారు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పేద ప్రజల ఆరోగ్య ప్రదాయిని రామకృష్ణా మిషన్

● రాజమండ్రి అదనపు సివిల్ జడ్జి రాఘవేంద్రరావు

రంపచోడవరం, జూన్8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్య ప్రదాయినిగా రాజమండ్రిలోని రామకృష్ణా మిషన్ అనుబంధ ఆరోగ్య సేవా సంస్థ పేరుగాంచి ందని రాజమండ్రి అదనపు సివిల్ జడ్జి టీవీ.రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం రంపచోడవరంలోని రామకృష్ణామిషన్ ఆరోగ్యసేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇక్కడ రోగులకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. గిరిజన, గిరిజనేతర పేదలకు అన్నిరకాల రోగాలకు ఇక్కడ పరీక్షలు, చికిత్సలు ప్రశంసనీయంగా అందుతున్నాయని ఆయన అన్నారు. రామకృష్ణ పరమహంస, స్వామీ వివేకానంద స్ఫూర్తితో యువత పురోగమించాలని ఆయన అన్నారు. యువతను చైతన్యపర్చే కార్యక్రమాలను రామకృష్ణా మిషన్ నిర్వహిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి రామకృష్ణా మిషన్ స్వామీజీలు ప్రజ్ఞానాధనంద మహరాజ్, లోకమయ నంద మహారాజ్, క్యాంప్ కోఆర్డినేటర్ కానుమను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం నాటి శిబిరంలో 400 మందికి వైద్యసేవలు అందించారు.



రంపచోడవరంలో రామకృష్ణా మిషన్ ఆరోగ్య సేవా కేంద్రలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్రరావు

మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులుకాకండి

మోతుగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పరిధిలో నర్సింగ్‌పూర్‌ను చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ సందర్శించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెల్లం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మావోయిస్టు సిద్ధాంతాలకు ఎవ రూ కూడా ఆకర్షితులు కాకూడదని, మావోయిస్టులకు ఎవరు సహకారం చేయవద్దని తెలిపారు. గంజాయిను పండించడం, రవాణా చేయడం తాగడం నేరమని, గంజాయి కేసుల్లో ఎవరైనా ఇరుక్కుంటే వారి కుటుంబం ఇబ్బంది పడుతుందని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం బచ్చులూరులో చింతూరు సీఐ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మావోయిస్టులపై గంజాయిపై అవగాహన సమావేశం నిర్వహించారు. బచ్చులూరు గ్రామయువతకు వాలీబాల్ కిట్స్ అందించారు. సర్పంచ్ వేమా సంధ్యారాణి, పోలీసులు పాల్గొన్నారు.



దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న సీఐ తెల్లం దుర్గాప్రసాద్

అమరావతి మహిళలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోండి

రంపచోడవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరుస్తూ సాక్షి మీడి యాలో కథనాల ప్రచురణ వెనుక ఉన్న కుట్ర ను ఛేదించాలని, బాధ్యులపై చర్యలు తీసు కోవాలని కోరుతూ రంపచోడవరంలోని తెలుగు మహిళలు ఆదివారం రంపచోడవరం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రంపచోడవరం మాజీ సర్పంచ్, నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు వై.నిరంజనీదేవి, నాయకులు వై.అచ్యుత, జి.రుక్మిణి, సాగిన పార్వతి, ఎమ్.మంగా బాయిలు రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలి

దేవీపట్నం: అమరావతి, ఆంధ్రరాష్ట్ర మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడిన కృష్ణంరాజు మీద కఠినచర్యలు తీసుకోవాలని ఆదివారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మాగాపు బాబురావు, సర్పంచ్ కుంజం రాజామణి, ముచ్చు వీరవెంకటసత్యనారాయణ, చవళం శివరామకృష్ణ, మద్దేటి అంజిరెడ్డి, రేలంగి రాంబాబు, పోతుల వాసు, పోతుల ప్రవీ ణ్, రాజు, కంగల కల్యాణి పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లో ఫిర్యాదు

చింతూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళలు ఆదివారం చింతూరు పోలీసు స్టేషన్లో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. సాక్షి ఛానెల్‌లో డిబెట్ నిర్వహి స్తున్న సందర్భంలో అమరావతి మహిళలపై వారిద్ద రు అనుచిత వ్యాఖ్యలు చేశారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అదేదశలో వారిద్దరూ మహిళలకు క్షమా పణలు చెప్పాలన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో కారం సత్యవతి, కారం అచ్చమ్మ, షేక్ ఫాతిమా, సోడి రాములమ్మ, మర్లపాటి గోపమ్మ, నాయకులు జి.సురేష్‌కుమార్‌చౌదరి, మల్లెల వెంకటేశ్వరరావు, శంకర్‌లు ఉన్నారు.

ముగిసిన విగ్రహాల పునః ప్రతిష్ఠ

ఎటపాక, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మం డలం పురుషోత్తపట్నం రామాలయంలో ఈనెల నుంచి ప్రారంభమైన విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నాలుగు రోజుల శ్రీసీతారామచంద్ర స్వామివారి జీవశిలా ధ్వజస్తంభం, బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి, పోతురాజు, మహాలక్ష్మీ అమ్మ, గుట్టముసలమ్మతల్లి, గ్రామ దేవతల విగ్రహాలను పునఃప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. చివరిరోజున మహిళలు, యువతులు అమ్మవారికి భోనాలు చెల్లించారు. కార్యక్రమానికి మహిళలు, భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయకమిటీ సభ్యులు విజ్జగిరి రవితేజ, అర్తిమాల చంద్రరావు, కుందూరి రాంరెడ్డి, సీహెచ్ వెంకట రమేష్ పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకుని వస్తున్న మహిళలు

ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోండి : తహసీల్దార్

రాజవొమ్మంగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సొంతింటి నిర్మాణానికి ఇంటి స్థలం లేని గిరిజనులకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నామని తహశీల్దార్ అల్లు సత్యనారాయణ అన్నారు. అందరికీ ఇళ్ల అనే పథకం ద్వారా అర్హులైన గిరిజనులకు మూడుసెంట్ల ఇళ్లస్థలం మంజూరు చేస్తున్నామని, ఇళ్లలేని గిరిజనులు ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యం అని తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఇంటి స్థలం లేని గిరిజనులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, వివరాలకు వీఆర్వోని సంప్రదించాలన్నారు.



తహసీల్దార్ సత్యనారాయణ

ఏడుగురు షైనింగ్‌స్టార్స్ ఎంపిక

ప్రత్తిపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులను షైనింగ్‌స్టార్స్‌గా ఎంపికచేసినట్లు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. 588మార్కులతో ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన స్కూల్ విద్యార్థి పల్నాటిమణి ప్రసాద్, అదే స్కూల్ కు చెందిన 583 మార్కులుసాధించిన గొర్ల రాం బా బు, 586 మార్కులు సాధించిన ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి వెంకటరమణ, 583 మార్కులతో అదే స్కూల్‌కు చెందిన సారిపల్లి చిట్టిబాబు, 583 మార్కులతో మినర్వా విద్యార్థి వేముల మల్లికార్జునరావు, 578మార్కులు సాధించిన ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి కొండి సూరిబాబు, 503 మార్కులు సాధించిన పాండవులపాలెం ఆశ్రమ పాఠశాల విద్యార్థి అన్నిక దుర్గాప్రసాద్‌లు షైనింగ్‌స్టార్స్‌గా ప్రభుత్వం గుర్తించిందని ఎంఈవో వివరించారు.

గంగాలమ్మ ఆలయంవద్ద అన్నదానం

రౌతులపూడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గుమ్మరేగుల గ్రామశివారు గంగా లమ్మతల్లి ఆలయంవద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఆలయం కోళ్ల రవి వ్యవసాయ క్షేత్రంలో ఉంది. ముందుగా కోళ్ల రవి, పద్మావతి దంపతులు ఆలయంవద్దకు బ్యాండ్ మేళాలు, కోలాటాలు, తారాజువ్వల సందడి నడుమ అమ్మవారి సారే తీసుకుని ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంవద్ద అమ్మవారికి పూజలుచేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, అల్లు బుజ్జీ, సుర్ల సత్తిబాబు, కేదారశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఏవీ నగరంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

● ఘనంగా సీతారాముల ఆలయ విగ్రహ, శిఖర ప్రతిష్ఠ
● భద్రాద్రి ఆలయమూర్తులను పోలిన విగ్రహాలు

తొండంగి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏవీ నగరంలో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసింది. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మణ సీతాసమేత శ్రీరామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వేదమంత్రోచ్చారణల నడుమ వైభంగా జరిగింది. భద్రాచలం ఆలయంలోని మూలమూర్తులను ముమ్మూర్తులా పోలి ఉండే విధంగా శ్రీరాముని తొడపై ఆశీనురాలైన సీతమ్మవారు, స్వామివారికి ఎడమ భాగాన లక్ష్మణమూర్తి కొలువై ఉండే విధంగా ఉన్న శిలా విగ్రహాలను టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దంపతులు సమకూర్చారు. వీటి ప్రతిష్ఠలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధన, అగ్నిమంధనం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, ఆవాహిత దేవతలైన యోగిని, వాస్తు, నవగ్రహ హోమాలు, సర్వతో భద్రమంట పూజలను నిర్వహించారు. అనంతరం హోమాలు మండపారాధనలు జరిపి శిలావిగ్రహాలకు దివ్యత్వం కలిగించే ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాస పూజలను అర్చకులు సత్యన్నారాయణ, ద్విభాష్యం చరణ్‌శర్మలు నయనానందకరంగా నిర్వహించారు. యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతుల చేత విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసం, ప్రాణప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, నేత్రోన్మీలనం, తదితర కార్యమాలను అర్చకస్వాములు వేదోక్తం గా నిర్వహించారు. భక్తుల రామనామస్మరణ నడుమ గణపతి, హనుమ. సీతారామ చంద్రుల విగ్రహాల ప్రతిష్ఠతోపాటు శుభ ముహూర్త వేళ ఆలయశిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఏవీనగరం గ్రామం కిక్కిరిసింది, గ్రామస్తులు తెచ్చిన బూరెలతో శిఖరానికి అభిషేకం జరిపారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. అనంతరం సీతారాములకు శాంతి కల్యాణం జరిపారు. యనమల దంపతులు కల్యాణకర్తలుగా నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల నాగేశ్వర్రావు, యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి నాగసోమరాజు, సుర్ల లోవరాజు, యినుగంటి సత్యన్నారాయణ, కొయ్యా శ్రీను పాల్గొన్నారు.



శాంతి కల్యాణంలో పాల్గొన్న యనమల దంపతులు

'ఎంబీబీఎస్ చేయడమే లక్ష్యం'



కోటనందూరు, జూన్8 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబంలోపుట్టి చదివిన లాలం స్వామి వెంకటసాయి రాష్ట్రసాయి ఎంసెట్ అగ్రికల్చర్,ఫార్మా పరీక్షలో 63వర్యాంక్ సాధించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నీట్ ప్రవేశం ద్వారా విజయం సాధించి ఎంబీబీఎస్‌చేసి పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమన్నారు. తల్లిదండ్రులు వెంకటరమణ, లోవకుమారి వ్యవసాయం చేసుకొని చదివిస్తున్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథసేవ

అన్నవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి రథసేవ ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించి విశేష అలంకరణలు, ప్రత్యేకపూజలు నిర్వహించి తూర్పురాజగోపురంచుట్టూ భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు.

సత్యదేవుడిని దర్శించుకున్న యలమంచిలి ఎమ్మెల్యే



సత్యదేవుడి దర్శనానంతరం ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అన్నవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పీఆర్వో కృష్ణారావు, గంటా విష్ణు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా

జగ్గంపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి):నాటుసారా తయారీ, అమ్మకాలపై నిఘా కోసం పోలీసులు డ్రోన్లను ఎగురవేశారు. భావవరం, గోవిందపురం పుంతరోడ్లలో కొండవాలు దిగువన డ్రోన్లు ఎగురవేశారు. నరేంద్రపట్నం గ్రామంలో డ్రగ్స్, దొంగతనాలు, బెట్టింగ్‌లు నివారణకు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఏఎస్‌ఐ భైరవస్వామి పాల్గొన్నారు.

నేడు ఒమ్మంగిలో యోగా ప్రదర్శన

ప్రత్తిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

కిక్కిరిసిన మురారి దుర్గమ్మ ఆలయం

గండేపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి గ్రామ శివారు తోటలో ఉన్న కనకదుర్గమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వేసవి సెలవులు కావడంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు

● ఆ మూడు గ్రామాలకు విద్యుత్ కష్టాలు తీరినట్లే

గండేపల్లి, జూన్8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఆ మూడు గ్రామాల కరెంటు కష్టాలు తీరినట్లేనని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మారుమూల గ్రామాలైన సింగరంపాలెం, రామయ్యమ్మపాలెం, కె.గోపాలపురంలో సుమారు 1300 కుటుంబాలు ఉండగా 4400మంది జనాభా ఉన్నారు. ఆయా గ్రామాల్లో ఓ మోస్తరు గాలి వేసిన రెండేసిరోజులు విద్యుత్ నిలిచిపోయేది. లోవోల్టేజీ, విద్యుత్ కోతలతో ఎన్నో ఇబ్బ ందులు ఎదుర్కొనేవారు. ఆగ్రామాలకు సంబంధించి ఒక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మాణం చేయాలని ఎన్నో ఏళ్లుగా అధికారులు, నాయకులను వేడుకున్నప్పటికీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక నాయకులు, ప్రజల కోరిక మేరకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో సుమారు రూ.3.29కోట్లతో 33కెవి/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. రెండు నెలలుగా పనులు ముందుకు సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో సబ్‌స్టేషన్ పనులు పూర్తవుతాయని గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ అన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూన్8(ఆంధ్రజ్యోతి):పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీఒక్కరూ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. ఆదివారం పట్టణంలో 1 వార్డులో వనమహోత్సవంలో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ రాయుడు చిన్న, నాగబాబు పాల్గొన్నారు.



పట్టణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

పుష్కరకాలువలో పూడికతీత పనులు ప్రారంభం

గండేపల్లి, జూన్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళూరు గ్రామంలో పుష్కర ప్రాజెక్టు అంతర్భాగమైన తాళ్లూరు లిఫ్ట్ వద్ద పుష్కర కాలువ జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను ఆదివారం పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నీరందించాలనే దృఢ సంకల్పంతో పనిచేసే రైతు బాంధవుడు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆదేశాలతో ఈ పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇరిగేషన్ ఈఈ రాజేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, జేఈ రమణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.



పూడిక తీత పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

గిరిజనులకు మంచినీటి కష్టాలు

శంఖవరం, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదమల్లాపురం గిరిజనులకు మంచినీటి కష్టాలు వెంటాడుతున్నాయి. చుక్కనీటి కోసం దూరప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి ప్రజల కష్టాలను తీర్చేందుకు మంచినీటి ట్యాంకును నిర్మించినా అధికారుల నిర్లక్ష్యంతో అది ప్రారంభానికి నోచుకోలేదు. పైపులైన్లు ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తుండటంతో మంచినీటి ట్యాంకు ప్రజలకు ఉపయోగపడటంలేదు. వేసవి మండుటెండలో సైతం మంచినీటికోసం నిరీక్షించాల్సిఉందని, తాగునీరుకోసం డబ్బులు వెచ్చించలేమని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తాగునీటి అవస్థలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంకు

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

తునిరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు రైతులు సద్వినియోగపరచుకోవాలని కేంద్ర పరిశోధనా సంస్థ రాజమండ్రి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్‌కే ప్రసాద్ తెలిపారు. తుని మండలం తేటగుంట గ్రామంలో రైతుసేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. మండల వ్యవసాయశాఖాధికారి బి.అశోక్‌కుమార్, ఉద్యాన అధికారిణి విజయలక్ష్మి, సిబ్బంది, బాబురావులతోపాటుగా తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు ఉన్నారు.

సీబీఎస్‌ఈ ఎడ్యుకేషన్‌పై అవగాహన

కిర్లంపూడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక నందిబొమ్మ దగ్గర కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సామర్లకోట దుర్గాప్రసాద్ సీబీఎస్‌ఈ వారు సీబీఎస్‌ఈ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. దాడి అప్పలరాజు, ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్‌బోర్డు ఎడ్యుకేషన్, సీబీఎస్ ఈ ఎడ్యుకేషన్‌కి వ్యత్యాసాలను వివరించారు. సీబీఎస్‌ఈ ఎడ్యుకేషన్ పట్ల తల్లిదండ్రులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్వామి, లవకుశలు, సంతోషి, హరి, కృపాకర్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం అమలు చేయాలి

ప్రత్తిపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బాలలకు విద్యార్థి దశ నుంచే సనాతన హిందూ సాంస్కృతి సాంప్రదాయాలను బోధించే విధంగా ఏర్పాటుచేయాలని అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు చెప్పారు. మండలంలోని ధర్మవరం నూకాలమ్మ ఆలయంవద్ద ఆదివారం అన్నమయ్య చిన్నారుల సర్వతో ముఖ వికాస తరగతులు నిర్వహించారు.

ముగిసిన జూడో వెయిట్ లిఫ్టింగ్ సమ్మర్ క్యాంపు

జగ్గంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని దేవి సెంటర్ డి ఫిట్నెస్ జిమ్‌లో జూడో వెయిట్‌లిఫ్టింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1నుంచి 31 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించారు. జూడో వెయిట్ లిఫ్టింగ్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం కోచ్ వి.రమణ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై జూడో వెయిట్ లిఫ్టింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో శిక్షణపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఖమ్మం కరాటే చాంపియన్ షిప్ పోటీలలో గోల్, సిల్వర్ , రజిత మెడల్స్ సాధించిన అనిల్, అభి, విక్రమ్ సాయిలకు, క్యాంపులో ఫస్ట్ సాధించిన కార్తీక్‌కు, సెకండ్ సాధించిన అమృతకు ఎమ్మెల్యే మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గంపేట డి.జిమ్ ఫిట్నెస్ అధినేత టీవీ.రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, చిరంజీవి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

బెండపూడి విద్యార్థికి ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో పదో ర్యాంకు



తొండంగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన దేశిన సూర్యచరణ్ ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పదో ర్యాంకు సాధించాడు. 91.1457 స్కోరుతో టాపర్ గా నిలిచాడు. ప్రాథమిక విద్య తుని శ్రీ ప్రకాష్‌లోను ఇంటర్మీడియట్ విశాఖపట్నం నారాయణ కాలేజీలోను విద్యను అభ్యసించాడు. తండ్రి వ్యవసాయదారుడు కాగా, అన్న ఇంజినీరింగ్ చదువుతున్నారు.

న్యూరాలజిస్ట్ కావాలన్నదే లక్ష్యం

న్యూరాలజిస్ట్ కావాలన్నది తన కలగా చరణ్ చెప్పాడు. నీట్ పరీక్షలో మంచి ర్యాంకు వచ్చి మెడిసిన్ సీటు సాధిస్తానని, తదుపరి న్యూరాలజిస్ట్‌గా ప్రజలకు మంచి సేవలందించాలన్నదే తన లక్ష్యమన్నారు.

పెద్దనాపల్లి విద్యార్థినికి 49వ ర్యాంకు



ఏలేశ్వరం, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి వైష్ణవి ఏపీ ఈఏపీ సెట్ అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో 49వ ర్యాంకు సాధించింది. ప్రాథమిక విద్యను జగ్గంపేట లోని శ్రీచైతన్య స్కూల్‌లోను, ఇంటర్మీడియట్ బైపీసీ విజయవాడ శ్రీగోశాలైట్స్‌లో చదివినట్లు వైష్ణవి తెలిపింది. తండ్రి వ్యవసాయదారుడు. మంచి ర్యాంకు రావడంపై సంతోషంగా ఉందని, ప్రణాళికాబద్ధంగా చదవానని, వైద్యురాలి కావడమే తన లక్ష్యమని వైష్ణవి అన్నారు.

'ఐఐటీలో చదవాలన్నది నా లక్ష్యం'

తొండంగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్‌లో 121 ర్యాంకు వచ్చినప్పటికీ నాకు ఐఐటీలో సీఎస్‌సీ గ్రూపు చదవాలన్న కోరిక ఉందని శృంగవృక్షంకు చెందిన యెలిశెట్టి పృధ్వి వీర సూర్య చక్రపవన్ అన్నారు. జెఈఈ అడ్వాన్స్‌లో కూడా 1472 ర్యాంకు వచ్చింది. ఐఐటీలో సీటు వస్తుందన్న నమ్మకం ఉంది. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలన్నదే నా లక్ష్యం అన్నారు.

రాష్ట్ర రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రత్తిపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమరావతిపై కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులు అత్యంత బాధ్యతా రాహిత్యంగా మాట్లాడారని మహిళలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

రౌతులపూడి: రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపైన, సాక్షి మీడియాపైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆదివారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తమరాల సత్యనారాయణతో కలిసి ఎంపీపీ మహిళలను తీసుకుని రౌతులపూడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, రౌతులపూడి గ్రామ టీడీపీ అధ్యక్షురాలు కొమ్ముల శ్రీదేవి, ఆసుపత్రి డైరెక్టర్ బండారు సత్తిబాబు, పైల వేణుగోపాల్, మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

ఏలేశ్వరం: సాక్షి టీవీలో అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు సుంకర సత్తిబాబు నేతృత్వంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మహిళలపై నీచంగా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై కఠినచర్యలు తీసుకోవాలని పెద్దనాపల్లి గ్రామానికి చెందిన నక్కా జయలక్ష్మీ, సాబత్తుల శిరీష, గొల్లపల్లి వెంకటలక్ష్మీ, కేశారపు నాగమణి, టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, సూతి బూరయ్య ఎస్‌ఐ రామలింగేశ్వరరావుకు వినపత్రం అందజేశారు.

జగ్గంపేట: రాజధాని అమరావతిపై మహిళలను తీవ్రంగా కించపరుస్తూ మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఐ రఘునాధరావుకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మహిళాశక్తి కమిటీ సభ్యులు పోలినాటి ధర్మానందకుమారి, నకిరెడ్డి సూర్యవతి, గెద్దాడ సత్యవేణి, గుమ్మల అనంతలక్ష్మి, గొల్లవిల్లి శ్రీదేవి, రాపాక లక్ష్మి, ఎల్లాటిఅమ్మాజీ, చెక్కా మరియా, తిపన సత్యవతి, బద్ది సురేష్, మోరుకుర్తి రాజు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తునిరూరల్: మరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షక్షణం చర్యలు తీసుకోవాలని తుని పట్టణ మహిళా విభాగ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

500 కిలోల నల్లబెల్లం, ఆటో సీజ్

● ముగ్గురి అరెస్ట్

ప్రత్తిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):500కిలోల నల్లబెల్లంను, ఆటోను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరం వద్ద ఆటోపై నల్లబెల్లాన్ని రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి కె.బావుసింగ్, విజయ్‌కుమార్, గంపల మణికంఠస్వామిలను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు.